# తొలగిన మబ్బులు

మామిడి చెట్టు పూత పెట్టింది. కొద్ది రోజులకి పిందెలు వస్తాయి. కోకిలలూ పక్షులూ వస్తాయి. వాటి కిలకిలా రావాలు చెవుల కింపుగా వుంటాయి. పిందెలు కాయలౌతాయి. పలకమారతాయి. పళ్ళవుతాయి. ఎవరెవరో ఎక్కడెక్కడి వారో వచ్చి ఎవరి కందినవి వారు కోసుకుపోతారు. చెట్టు బోసిపోతుంది. మూగదైన ముత్తయిదువులా అయిపోతుంది. ఆలనా పాలనా లేక ఏ వర్షపు నీరో తాగి బతుకుతూంటుంది.

దాన్ని చూస్తుంటే ఏదో అలజడి! భూమిని నమ్ముకుని బతికే ఆ చెట్టుకీ మనిషి జీవితానికీ ఎక్కడో ఏదో పోలిక- దొరికీ దొరకని నిదర్శనాలు!

ఎప్పటి చెట్టో అది! ఎవరు నాటేరో... ఏపుగా పెరిగి ఆ పెన్షన్ ఆఫీసు ఆవరణలో అందరికీ నీడనిస్తోంది.

ఉదయం తొమ్మిది-

ఇంకా స్టాఫ్ ఎవరూ రాలేదు. బంట్రోతు వీరాస్వామి వచ్చి తలుపులు తీసి, గదులు తుడిపించి, కూజాతో నీళ్ళు పెట్టి గది ముందు బల్ల మీద కూర్చున్నాడు.

ఆ ఉదయం పూట చల్లదనంలో బాల్కనీలో కాసేపు నిల్చుని ప్రకృతిని చూడ్డం; పక్షుల కిలకిలా రావాల్ని వినడం యాంత్రిక జీవనంలో భాగమైపోయింది. గడియారంలో కాలం ముళ్లు కదులుతున్న కొద్దీ ఏకాంతం కరిగిపోతుంది. దూరంగా పడవ సరంగుల విశ్రాంతి గృహాలలో కదలికలు... మొదలౌతాయి. నక్షత్రాల నీడలో రేయంతా సముద్రంలో వేచి వున్న ఓడలు రంకె వేస్తూ హార్బర్‌లోకి ప్రవేశించే సందడి!

వేలకొద్దీ కార్మికులనీ, ఉద్యోగులనీ పోషిస్తున్న ఓడరేవు. వేల మైళ్ళ దూరంలో వుండే దేశాల మధ్య సరుకుల రవాణాకు ఆలవాలమై ప్రపంచ దేశాల మైత్రీ సంబంధాలకు ఆటపట్టవుతోంది. ఎందరి జీవితాలలో ఆ రేవు నీడన సేదదీరుతున్నాయి. పదవీ విరమణ తర్వాత కూడా దేశ ప్రగతికి సాయపడిన అక్కడి ఉద్యోగుల, కార్మికుల, అధికారుల శ్రేయస్సును చూసే, పెన్షన్ సదుపాయం అతనికీ; అతని కుటుంబానికీ - ఏ దేశ ప్రజకైనా అంతకంటే కావాల్సిందేముంది? జీవనోపాధీ, బతికున్నంతకాలం భుక్తికి లోటులేని ఆర్థిక స్థితీ -

వ్యక్తి బాగుంటేనే సంఘం బాగుండేది. దేశం బాగుపడేది! - ఎవరో అన్న మాటలు గుర్తుకొస్తున్నాయి.

పది గంటలు కావస్తోంది - ఉద్యోగులు ఒకరూ ఒకరూ వస్తున్నారు. వారి వెనుకే పెన్షనర్లూ! పెన్షన్ తగ్గిందేమని ప్రశ్నిస్తూ కొందరూ; మనియార్డర్ ద్వారా రావల్సిన ఆ నెల పెన్షన్ రాలేదని కొందరూ; బకాయిల కోసం కొందరూ; కొత్తగా రిటైరైన ఉద్యోగులూ; ప్రమాదాలలో అశువులు బాసిన కార్మికుల వితంతువులూ... రోజూ ఎందరో- ఏవో కారణాల మీద వస్తూనే వుంటారు.

గేటు ముందు ఆటో ఏదో ఆగింది. అందులోంచి ఓ ముసలాయనను దింపి మడత

కుర్చీలో కూర్చోబెట్టి యిద్దరు కలిసి మోసుకొస్తున్నారు. ముసలాయనకు డెబ్భయ్ ఏళ్ళపైనే వుంటాయి. కదల్లేని అనారోగ్య పరిస్థితి కాబోలు!

"ఆ పరిస్థితిలో అతన్ని ఎందుకు తెస్తున్నారు?" అడిగేను వాళ్ళని.

"మనియార్డరొచ్చేటయాంకి పిల్లకి జబ్బు చేసిందని కబురొస్తే వూరెలిపోనాం బాబూ. పోస్టుమేను పించనీ తిప్పేశాడు" అన్నాడు ముసలాడు.

"ముందుగా పోస్టుమేన్‌కి చెప్పి వుంచుకోవాలి. లేదా తీసుకున్న తర్వాతే వూరెళ్ళాలి. ఈ స్థితిలో ఎంత కష్టమైందో చూడు. ఆ సొమ్ము మాకు తిరిగొస్తేనే మేమైనా యివ్వగలం. ఆ నాలుగో నెంబరు గదిలో కనుక్కోండి" అన్నాను.

ముసలాయన్ని తీసుకొచ్చిన వాళ్ళు అతగాడినక్కడ వుంచి వెళ్ళేరు. అతని కొడుకులేనట వాళ్ళు.

"నీ కొడుకులేంచేస్తున్నారు?" అడిగేను ముసలాయన్ని.

"ఇదో... ఇలాగే పించనొచ్చే టయాంకి గెద్దల్లా వస్తారు. తర్వాత బలాదూర్‌గా తిరుగుతారు. వొళ్ళొంచి పన్జేయడానికి నామోషీ" అన్నాడతను.

గడియారం పది గంటలు కొట్టింది. నా కేబిన్‌లోకి వెళ్ళి సీట్లో కూర్చున్నాను. ఆ వెంటనే ఫోను మోగింది. తీసేను. బాస్ నించి! నైట్ షిఫ్ట్‌లో క్రేన్ మీద నించి పడిపోయి మృతి చెందిన కార్మికుడి ఫైలేదో వస్తోందిట, అర్జంటుగా సెటిల్ చేసి పేమెంట్ అరేంజ్ చేయమని. అటువంటి కేసుల్ని మానవతా దృష్టిలో వెంట వెంటనే సెటిల్ చేయడం అక్కడి సంప్రదాయం.

స్టాఫ్ తాలూకు అటెండెన్స్ రిజిష్టర్ తెచ్చి టేబుల్ మీద ఉంచేడు వీరాసామి. దూరం నించి రావల్సిన ఒకరిద్దరు తప్ప అంతా వచ్చినట్టే. డాక్ ప్యాడ్ తెరిచి ఆ రోజు ఉత్తరాలు చూస్తూంటే కేబిన్ డోర్ చప్పుడైంది.

ఎస్టాబ్లిష్‌మెంట్ యూనిట్‌లో పనిచేసే వీర్రాజూ, అతనితో పాటు మరొకరూ లోపలికి వచ్చారు. వీర్రాజు అందరితోనూ చనువుగా ప్రవర్తిస్తాడు.

"నమస్తే సార్. మీ దగ్గరికి ఫైలొకటి వచ్చింది. లాంగ్ పెండింగ్ కేసు. మెరైన్ యూనిట్లో కాసారపు మరిడయ్య అనీ..." అతను చెబుతుంటే మధ్యలోనే ఆపి,

"కేసు నిన్ననే నా దగ్గరకొచ్చింది. చూసి పంపిస్తాను" అన్నాను.

"అలాక్కాదు సార్. చాన్రోజులైపోయింది. అనసూయమ్మగారికి యిప్పుడు అరవై ఏళ్ళు. వాళ్ళ అబ్బాయే యీయన" అంటూ తన వెనుక వచ్చిన అతన్ని చూపేడు.

"మీరెప్పుడు తీసుకురమ్మంటే అప్పుడు వాళ్ళ అమ్మగార్ని తీసుకొస్తాడు. మీరు సంతకం చేసి పంపిస్తే కేష్ డిపార్ట్‌మెంట్‌లో నేను చెబుతాను" అన్నాడు వీర్రాజు.

"అలాగే చూసి పంపిస్తాలెండి" అన్నాను, అంతకంటే మాట్లాడ్డం యిష్టంలేక.

వీర్రాజు వెళ్ళిపోయాడు గాని అతనితో వచ్చినాయన మాత్రం అక్కడే నిలబడ్డాడు.

"చూడండీ. నేను ఫైలు చదివాను. కేసు అర్థమైంది. దీన్ని ఇన్నాళ్ళు డిలే చేయనక్కర్లేదు. కానీ డిలే అయింది. మీ అమ్మగారి పట్ల నాకు సానుభూతి ఉంది. నేను చేయాల్సిన సాయం నేను చేస్తాను. అయితే తొందరగా అవడానికి గాని; మరొకందుకుగాని మీరిక్కడ ఎవర్నీ ఆశ్రయించక్కర్లేదు – ఎవరి జేబులూ నింపే ప్రయత్నమూ చేయకండి. నాలుగు

రోజుల తర్వాత వచ్చి కనబడండి" అన్నాను అతనితో.

అతను సంశయాత్మకంగానే తలూపి వెళ్ళిపోయాడు.

◆ ◆ ◆

కాసారపు మరిడయ్య పదేళ్ళ క్రితం ఉన్నట్టుండి కనిపించడం మానేశాడు. వ్యసనాలూ, అప్పులూ కారణం కావొచ్చునుకున్నారంతా. ఎక్కడకు వెళ్ళినా ఎప్పుడోప్పుడు రాకమానడని ఎదురు చూశారు ఇంట్లో వాళ్ళూ; ఆఫీసులో వాళ్ళూ. కానీ నెలలూ సంవత్సరాలూ, గడిచినా అతని జాడ లేదు. కొన్నాళ్ళు చూసి పేపర్లలో ప్రకటన వేసి అతని పేరును రికార్డు నుంచి తొలగించారు ఆఫీసు వారు. భార్య, పిల్లలు దిక్కుతోచని స్థితిలో వూరుకున్నారు.

ఏళ్ళు గడిచాయి. అప్పటికప్పుడు – పదేళ్ళ తర్వాత– తన భర్తకు రావలసిన సొమ్మేదో వుందనీ అది తనకు చెల్లించమని మరిడయ్య భార్య కాగితం రాసి పెట్టుకుంది. దాంతో మళ్ళీ కదిలింది. ఆమె పెట్టుకున్న అర్జీ పరిశీలించడానికీ, నిబంధనల ప్రకారం ఆజ్ఞలు జారీ చేయడానికీ కొంత కాలం పట్టింది.

మరిడయ్యకు సంబంధించిన ఫైల్లో – అతని భార్య అనసూయమ్మ పెట్టుకున్న అర్జీ కాగితం; మరిడయ్య మతి స్థిమితం లేని కారణంగా వెళ్ళిపోతే వెదికించమని ఆమె పోలీసు వారికి పెట్టుకున్న విన్నపం కాపీ; మరిడయ్య కనిపించకుండా పోయి పదేళ్ళ పైనే అయింది కాబట్టి, ఉన్న రూల్సు ప్రకారం అతను చనిపోయినట్లుగా భావించి అతని తదనంతరం అతని భార్య అనసూయమ్మ పెన్షన్, తదితర సొమ్ములను అందుకోడానికి అర్హురాలని హెడ్డాఫీసు నుండి వచ్చిన ఉత్తర్వూ; మరిడయ్య భార్య, పిల్లల వివరాలతో మండల్ రెవెన్యూ ఆఫీసర్ యిచ్చిన 'లీగర్ హేర్' ధృవీకరణ పత్రమూ; తప్పిపోయినట్టు చెప్పబడే మరిడయ్య తమ పరిధిలో దొరకలేదని పోలీసు వారు ఆ తేదీ వరకూ యిచ్చిన ఉత్తరం.... ఇలా నిబంధనల ప్రకారం వుండవలసిన, కావల్సిన వివరాలూ కాగితాలూ వున్నాయి. పోతే – మరిడయ్య చేసిన సర్వీసుకు అతనికి వెళ్ళవలసిన సొమ్మును లెక్కగట్టి మినహాయింపులు పోను అతని భార్యకు యివ్వడమే తరువాయి. అందుకు కూడ సంబంధిత అధికార్ల ఆర్డర్లు రడీగానే వున్నాయి. రాయవలసిన నాలుగు ముక్కలూ రాసి సెక్షన్‌కి పంపించేను.

◆ ◆ ◆

నాలుగు రోజులు పోయాక అతనొచ్చాడు. పేరు అప్పల్రావుట. ఈ మారు అతని వెనుక వీర్రాజు లేడు. కూర్చోమని కుర్చీ చూపించి అతని గురించి వివరాలు అడిగేను. అతని కొక అన్న, తమ్ముడు, ఒక చెల్లెలూనట – ఏడాది క్రితం చెల్లెలికి పెళ్ళి చేశారట. తను మేనమామ కూతుర్ని పెళ్ళాడి ఆయనిప్పించిన ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. పెద్దతనికి బట్టల షాపులో పని – తమ్ముడు చదువబ్బక రికామీగా తిరుగుతున్నాడు.

"మీ ఫైలు సెక్షన్ నించి మేనేజర్ గారికి వెళ్ళింది. బహుశః ఆయన దగ్గర్నించి ఈ రోజు వచ్చేస్తుంది. రెండు రోజులాగి మీ అమ్మగార్ని తీసుకొస్తే పెన్షన్ పుస్తకం యిస్తారు" అన్నాను.

"మరి పేమెంట్ ఎప్పుడొస్తుంది సార్" ఆత్రంగా అడిగేడు.

"దానికి మరో రోజు పడుతుంది. వచ్చేటప్పుడు ఆమె ఫోటోలు రెండు తీసుకురండి" అన్నాను.

అతను వెళ్ళిపోయాడు. చెప్పినట్టే రెండు రోజులాగి అనసూయమ్మను తీసుకొచ్చాడు.

సంతకాలూ, వేలిముద్రలూ, ఫోటోలూ తీసుకొని, పూర్తి చేయించాల్సిన ఫారాలు పూర్తి చేయించి ఆమెను నా దగ్గరకు తీసుకొచ్చాడు గుమస్తా. కేసును నా టేబుల్ మీద పెట్టి వెళ్ళాడు.

కాస్త దూరంగా బితుకు బితుగ్గా నిల్చున్న ఆమె వంక చూసేను. సాదా సీదాగా బీదగా ఉందామె. అరవై ఏళ్ళదే అయినా డెబ్బయ్ దాటినట్లు వడలిపోయి వుంది. ఈ మారు ఆవిడతోపాటు పెద్ద కొడుకు కూడా వచ్చాడు. కొడుకులిద్దరూ బయట కారిడార్లో బెంచీ మీద కూర్చున్నారు.

ఆమెను ఎదురుగానున్న కుర్చీలో కూర్చోమన్నాను. బెరుగ్గానే కూర్చుంది. ఆమెకు చెల్లించే గ్రాట్యూటీ మొత్తం; యితర చెల్లింపులూ, నెలనెలా వచ్చే పెన్షన్ వివరాలూ చెప్పేసరికి ఒక్కసారి ఆమె కళ్ళ వెంట నీళ్ళు జారాయి. మనిషి ఎందుకో ఉక్కిరి బిక్కిరయినట్లుంది. ఇరవై అయిదు వేలంటే ఆమెకు ఆ పరిస్థితిలో పెద్ద మొత్తమే మరి! అది గాక నెల నెలా ఆరొందల పెన్షన్!

"మీకు యీ మొత్తమంతా చెక్కు రూపంలో యిస్తారు. డబ్బు చేతికివ్వరు. మరి మీకు బేంకు అక్కౌంటు వుందా?" అనడిగాను – ఉండే ఆస్కారం లేదని తెల్సినా.

"నేను బేంకు గుమ్మం ఎప్పుడూ తొక్కలేదు నాయనా. అవుసరం కూడా రాలేదు" అంటూ కన్నీళ్ళ మధ్య చెప్పింది. ఇక మీద కూడా ఆ అవసరం ఉండదేమో అని కూడా అంది. నాకు లీలగా ఏదో అర్థమైంది. చెక్కు మార్చుకుందికి బేంకు అకౌంటు అవసరమేమో గాని అందులో ఆమె వాడుకునేందుకు వీలుగా డబ్బు వుండొద్దూ?

"ఇది మీకు చెందిన సొమ్ము. మీ భర్త లేడన్న లోటు తప్ప మీ జీవితాంతం తిండికి లోటుండదు" – ఏదో అనాలని అన్నట్టే వున్నాయి నా మాటలు.

"ఇది నాకు పెద్ద మొత్తమే. యీ బతుకులో అంత సొమ్ము ఎప్పుడూ ఎరగను. కానీ యిది నా దాకా రావొద్దా బాబూ" అంది. అలా అంటూనే బయటకు చూసింది, కొడుకులు గాని విన్నారేమో అన్నట్లుగా.

ఆమె స్థితి లీలగా అర్థమైంది. రోజూ ఎందర్ని చూట్టం లేదు? పెన్షన్ తీసుకునే ముసలి తల్లితండ్రుల నుండి డబ్బు లాక్కునే కొడుకుల్ని! కొందరు కొడుకులైతే బేంకు వరకూ రిక్షాలో తీసుకువచ్చి డబ్బు అందుకున్న మరుక్షణం మాయమైపోతారు. ఆ ఏడ్పులు మాకు కొత్త కావు.

ఆమె నాతో ఏదో చెప్పాలని సందేహిస్తున్నట్లు అర్థమైంది. ఒక్కోప్పుడు రక్తసంబంధీకుల దగ్గర దాచినవి కూడా పరులకు చెప్పుకునే అవస్థలు ఎదురౌతాయి. రక్త సంబంధాలు కూడా వ్యాపార బంధాలైపోతున్నాయి మరి!

"మీ యిబ్బందేమిటో చెప్పండి. నేను చేయగలిగినదేమైనా వుంటే చేస్తాను" అన్నాను.

ఆమె నోరు విప్పింది.

"నా పెనిమిటి ఎక్కడున్నాడో గాని యిన్నేళ్ళూ నేను పడ్డ హింస పగవారికి కూడా

వద్దు నాయనా. ముగ్గురు మగపిల్లలూ ఒక ఆడపిల్ల. ఏం తిన్నామో ఎలా వున్నామో ఆ భగవంతుడికే తెలుసు. పెద్దాడు అమాయకుడు. ఆడి దగ్గరే నా బతుకు. రెండో వాడూ మంచివాడే. కానీ పెళ్ళాం ఎంత చెబితే అంత! ఆకరోడొట్టి జులాయి వెధవ. సినిమాలకీ షికార్లకీ డబ్బు తగలేస్తాడు. ఆడికి చదువు లేదు. ఇప్పుడీ డబ్బు గాని ఆడి కళ్ళ బడిందా ఆదూరుకోడు. ఎంతో కొంత యిమ్మంటాడు. లేదా వాటా అయినా పంచమంటాడు. ఇన్నాళ్ళూ అందర్నీ పోషించిన పెద్దోడికి ఎంతో కొంత యివ్వాలి గద. కష్టమంతా ఆడిదే. చిన్న జీతం – పెద్ద సంసారం! ఆడికీ యిద్దరు పిల్లలు. ఆడపిల్ల పెళ్లి కొచ్చేసింది. వాడు అడక్కపోయినా అవసరానికి ఆదుకోవాలి గదా. అలా అంటే నా రెండో కోడలు వూరుకోదు. డబ్బు దగ్గరకొచ్చేసరికి మా అల్లుడూ అశబోతే. ఈ డబ్బు సంగతి తెలిస్తే అతగాడెలా మార్తాడో! ఇంత మొత్తంగా వచ్చే డబ్బు వల్ల కుటుంబంలో ఎన్ని తగూలొస్తాయో తల్చుకుంటే బెంగగా వుంది – అంత డబ్బూ ఒక్కమారుగా కాకుండా దఫ దఫాలుగా వచ్చే మార్గమేదన్నా వుంటే చూడు తండ్రీ. నా బిడ్డ లాంటివాడవి" అంది.

ఆవిడ ఆవేదన, భయం అర్థమైంది.

"ఇప్పటికే మీకు రావాల్సిన సొమ్ము లేటుగా వస్తోంది. ఇప్పుడది దఫదఫాలుగా యివ్వడానికి వీలవదు. పెన్షన్ మాత్రం నెలనెలా బేంకుకు పంపిస్తాం" అన్నాను.

ఆమె మాట్లాడలేదు. ఆ ముఖంలో భయం, నిస్సహాయతా.

"అయితే ఒక్కటుంది. మీరొప్పుకుంటే ఈ మొత్తాన్ని యిప్పుడప్పుడే ఎవరూ వాడకుండా బేంకులో మీ పేర్న మూడేళ్ళకు ఫిక్స్‌డ్‌గా వేయించే ఏర్పాటు చేస్తాను. దాని మీద నెలకో మూణ్ణెలకో వడ్డీ వచ్చేలా చేసుకుంటే ఆ సొమ్మును మీకిష్టమైనట్టు ఖర్చు చేసుకోవచ్చు" అన్నాను.

"అలా చెయ్యి బాబూ?" అందామె. ఈ మాటు ఆమె ముఖంలో ఆనందరేఖలు!

.... బయట కూర్చున్న ఆమె కొడుకులిద్దర్నీ లోపలికి పిలిపించాను. వచ్చి, తల్లికి చెరోవైపూ నిల్చున్నారు వాళ్ళు. పెన్షన్ వివరాలూ, ఏడాదికోమారు విధిగా యివ్వాల్సిన 'లైఫ్ సర్టిఫికెట్' గురించీ వారికి చెప్పి;

"ఒక వేళ మీ నాన్నగారే గనక తిరిగివస్తే కొంత సొమ్ము మీరు కట్టాల్సి వుంటుంది. అందుకని మొత్తంగా వచ్చిన పాతిక వేల చిల్లరా మీ అమ్మగారి పేరునే బేంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నాం. మూడేళ్ళ తరువాత ఆ సొమ్ము మీ అమ్మగారి ఇష్ట ప్రకారం వాడుకోవచ్చు. అందుకామె కూడా అంగీకరించారు. ఆమె బాధ్యతను మోసే కొడుకులు కాబట్టి మీ అంగీకారం కూడా తీసుకుంటున్నాను" అన్నాను.

కాదనలేక కాస్త అసంతృప్తిగానే తలూపేరు యిద్దరూ.

వాళ్ళే గనుక ఎక్కువగా ప్రశ్నించి రూల్సు మాట్లాడితే నా దగ్గర తగిన సమాధానాలుండవని నాకు బాగా తెలుసు.

వాళ్ళు వెళ్లేక ఊపిరి పీల్చుకున్నాను.

మర్నాడు ఆ పనులన్నీ అనుకున్నట్లుగానే జరిగిపోయాయి.

◆ ◆ ◆

అనసూయమ్మగారి సమస్యను పరిష్కరించడంలో నేనేదైనా తప్పుడు మార్గాన్ని

సూచించేనా అని కాస్త విచికిత్సకు లోనైన మాట నిజం. అయితే అంత డబ్బు ఆమెకు ఆనందాన్ని యివ్వకపోగా అశాంతినే మిగులుస్తుంది. కాలం కొన్ని సమస్యలకు పరిష్కారాన్ని యివ్వవచ్చు. అదే నా ఆశ.

ఏడాది తర్వాత 'లైఫ్ సర్టిఫికెట్' యివ్వడానికొచ్చిందామె. ఈ మారు ఆమెతోపాటు ఆమె మనవడు కాబోలు పదేళ్ళ వాడున్నాడు. ఆమె నా దగ్గర కొచ్చి దండం పెట్టి "గుర్తున్నానా బాబూ" అంది.

"లేకేం? బావున్నారా?" అన్నాను.

"బాగానే వున్నాం బాబూ– మీరు చేసిన సాయం మరిచిపోలేను. పూర్వం కంటే నన్నిపుడు పిల్లలంతా బాగానే చూసుకుంటున్నారు – చిన్నాడు కూడా దార్లో పడ్డాడు – ఓ మెకానిక్ షాపులో పనికి కుదిరి సంపాదనా పరుడయ్యేడు – మనవరాలికి కూడా పెళ్ళి కుదిరింది. పెద్దాడు ఆడి తాహతుకు తగిన సంబంధమే కుదుర్చుకున్నాడు. రెండో కోడలు ఓ గాజుల షాపులో పనికి కుదిరింది. మూణ్ణెల్లకో మారొచ్చే వడ్డీ డబ్బులతో కూతురికీ, కోడళ్ళకీ నా చేత్తో బట్టలు కొంటున్నాను. వాళ్ళకి ఆనందం, నాకు తృప్తీ" అంది. నేనేం మాట్లాడలేదు. మబ్బులు తొలగిన ఆకాశంలా ఉందామె వదనం.

"ఆ సొమ్మే అప్పట్లో చేతికందితే యీ పాటికి రూపాయి కూడా మిగలక పోను తండ్రీ. అప్పటి పరిస్థితులు అలాంటివి! సరైన ఆలోచన చేసి దారి చూపించావు. ఆ పుణ్యం నీదే" అంది

"పుణ్యమో పాపమో... నా చేత అబద్ధం కూడా ఆడించేరుగా" అన్నాను నవ్వుతూ.

"అన్నట్టు చెప్పడం మరచేను. రెండేళ్ళ తర్వాత వచ్చే ఆ డబ్బుతో తణకాలో వున్న మా యింటిని విడిపించి బాగు చేయించే ఆలోచనలో వున్నారు నా ముగ్గురు కొడుకులూ" అంది ఆనందంగా.

"మంచిదేగా" అన్నాను.

"ఆ యిల్లు నిలబెట్టిన పుణ్యమూ నీదే తండ్రీ" అంది చేతులు జోడిస్తూ.

నాకు నోట మాటలు రాలేదు. కనురెప్పలకు మధ్య నీటి పొర జేరింది.

ఒక చిన్నమాట... ఒక మందలింపు... ఒక చిన్న సాయం ఒక్కోప్పుడు ఎదుటి వారికి కొండంతగా ఉపకరించవచ్చు. అసంకల్పితంగా చేసే పనే ఒక్కొప్పుడు ఎంతో మందికి వూరటనీ; సంతోషాన్నీ, తృప్తినీ కలిగించవచ్చు.

ఎక్కడ నుంచి ఎక్కడికో ఎగిరిపోయే ఒక చిన్న పక్షి ద్వారా బీజ వ్యాప్తి జరుగుతుంది. అది అసంకల్పితంగానే కావొచ్చు. అయినా విత్తులు అలా వెదజల్లబడి మొలకెత్తుతాయి. మొక్కలు వృక్షాలై మానవాళికీ, యితర ప్రాణికోటి మనుగడకూ ఆధారభూతాలౌతాయి.

ఆమె వెళ్ళిపోయిన చాలాసేపటివరకూ గదిలోనూ, మనసులోనూ నిశ్శబ్దమే మిగిలి పోయింది.